ప్రమాదకరంగా మూలమలుపులు

- కనిపించని సూచిక బోర్డులు
- బీబీపేట మండలంలో ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు


బీబీపేట నుంచి యాడారం చెరువు కట్ట మీద దారిలో..


యాడారం గ్రామం నుంచి కోనాపూర్ వెళ్లే రహదారిలో ప్రమాదకరమైన మూలమలుపు

బీబీపేట: మండలంలో పలు చోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మండల కేంద్రం యడారం గ్రామం మీదుగా కామారెడ్డి వెళ్లే రోడ్డులో సుమారు 10 నుంచి 15 చోట్ల ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి. ఈమూలమలుపుల్లో పెద్ద పెద్ద బండరాళ్లు ఉండడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనం కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. యాడారం గ్రామం నుంచి కోనాపూర్ వరకు మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. బీబీపేట నుంచి యాడారం గ్రామానికి మూడేళ్ల క్రితం చెరువు కట్టపై నుంచి వేసిన రోడ్డు మార్గంలో మూలమలుపులు ఉన్నాయి. మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేవు. బీబీపేట నుంచి మెదక్ జిల్లాకు వెళ్లడానికి ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, రామాయంపేట మీదుగా వాహనాదరులు వెళ్తుంటారు. రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లచెట్లతో పాటు మలుపులు ఉన్నాయి. ఒకేసారి ఎదురుగా వాహనం వచ్చినప్పుడు అదుపుతప్పి కిందపడిపోయిన ఘటనలు ఉన్నాయి. రద్దీగా ఉండే రోడ్డు అయినప్పటికి కనీసం సూచిక బోర్డులు కరువయ్యాయి. ఈరోడ్డు గుంతలు పడి ధ్వంసమైంది. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాల పాలైన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని ఆయా గ్రామాల రోడ్డుకు ఇరువైపుల దట్టంగా పెరిగిన ముళ్ల చెట్లు, పొదలను తొలగించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


బీబీపేట నుంచి ఉప్పర్‌పల్లి వెళ్లే దారిలో..

బండరాళ్లు ఉన్నాయి..



మండల కేంద్రం నుంచి యాడారం వయా కోనాపూర్ మీదుగా కామారెడ్డి వెళ్లాలంటే భయం భయంగా వెళ్లాల్సి వస్తుంది. పదుల సంఖ్యలో మూలమలుపులు ఉండడమే కాకుండా రోడ్డుకు ఇరువైపుల పెద్ద పెద్ద బండ రాళ్లు ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్, యాడారం

ముళ్లపొదలు తొలగించాలి



మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే దారులపై మూలమలుపుల వద్ద సూచికంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కొత్తగా వచ్చే వాహనదారులకు ఎక్కడ మలుపు ఉందో గమనించక అయోమయానికి గురవుతున్నారు. అంతే కాకుండా బీబీపేట నుండి ఉప్పర్‌పల్లి రోడ్డులో పదుల సంఖ్యలో గుంతలు ఉన్నాయి.

– సంతోష్, ఉప్పర్‌పల్లి గ్రామస్తుడు

క్లుప్తంగా

జాతీయ స్థాయి సెపక్‌తక్రాకు భోగ అక్షయ్



కామారెడ్డి అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాలుర విభాగం సెపక్ తక్రాలో బ్రాహ్మణపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి భోగ అక్షయ్ సత్తా చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.మల్లేష్, కార్యదర్శి నరేష్‌లు తెలిపారు. అక్షయ్ ఈనెల 15 నుంచి 21 వరకు ఇంఫాల్‌లో నిర్వహించే జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారన్నారు. అక్షయ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

తాలు, పొల్లు లేకుండా చూడాలి



భిక్కనూరు: యాసంగి వరి కోతలు మొదలైన సందర్భంగా హార్వెస్టర్ డ్రైవర్లు, ఓనర్లతో వ్యవసాయ అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కామారెడ్డి ఏడీఏ అపర్ణ మాట్లాడుతూ ధాన్యంలో పొల్లు, తాలు లేకుండా నాణ్యత ఉండేలా చూడాలన్నారు. వరికోతలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ హార్వెస్టర్ గేర్ లోడ్ రెండులో ఉంచి 15 నుంచి 20 ఆర్‌పీఎంలో పెట్టి ఫ్యాన్ బెల్ట్ అమర్చుకునే విధంగా చూడాలన్నారు. భిక్కనూరు, బీబీపేట, దోమకొండ ఏవోలు శోభ, నరేంద్ర, మణిదీపిక, ఏఈవోలు వినోద్, లిఖిత్, మౌనికల, లత, తదితరులున్నారు.

అక్రమ ఉద్యోగ నియామకాలను రద్దు చేయాలి



కామారెడ్డి టౌన్: మెడికల్ కళాశాలలో జరిగిన అక్రమ ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్హత లేకున్నా ఉద్యోగాలు పొందిన పలువురు అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను బహిరంగ విచారణ చేపట్టాలన్నారు. కామారెడ్డి మ్యాన్ పవర్ ఏజెన్సీ, కళాశాల ప్రిన్సిపల్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌లు, సిబ్బంది లావాదేవీల విచారణ జరిపితే అక్రమాలు బయటపడుతాయని ఆరోపించారు. కార్యక్రమంలో బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్ కుమార్, పీడీఎస్‌యూ, బీసీ, జీవీఎస్ సంఘాల జిల్లా అధ్యక్షులు సురేష్, నాగరాజు, వినోద్ కుమార్, నిరుద్యోగులు రవి , గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'విచ్చల విడిగా తైబజార్ వసూలు చేయడం తగదు'



కామారెడ్డి అర్బన్: పట్టణంలో తైబజార్ పేరిట రైతుల నుంచి విచ్చల విడిగా డబ్బులు వసూలు చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ చేసింది. గురువారం జిల్లా బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి విద్యుత్, వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలు వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్ల శంకర్‌రావు, ప్రతినిధులు కొమిరెడ్డి చిన్న అంజన్న, లక్కాకుల భాస్కర్, భైరవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూములకు వెళ్లే దారిని కాపాడండి



గాంధారి(ఎల్లారెడ్డి): తమ వ్యవసాయ భూములు వెళ్లే దారిని కబ్జా చేసి గోడ నిర్మిస్తున్నారని, వ్యవసాయ భూములకు వెళ్లే దారిని కాపాడాలని కోరుతై మండల కేంద్రానికి చెందిన రైతులు గురువారం తహసీల్దార్ రేణుక చౌహాన్‌కు వినతి పత్రం ఇచ్చారు. రాధాసామి సత్సంగ్ నిర్వాహకులు వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తూ దారులకు అడ్డంగా గోడలు నిర్మిస్తున్నారని వారు చెప్పారు. తమ వ్యవసాయ భూములకు ట్రాక్టర్ వెళ్లేంత దారి ఇప్పించాలని వారు తహసీల్దార్‌ను కోరారు.

కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించాలి


ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్ పర్సన్ రజిత


కామారెడ్డి రూరల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్ పర్సన్ లక్ష్మి


వదల్‌పర్తిలో.. ఏఎంసీ చైర్ పర్సన్ రజిత


మొగాలో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్/ కామారెడ్డి రూరల్/రాజంపేట/భిక్కనూరు/పిట్లం/లింగంపేట/రామారెడ్డి/గాంధారి/ తాడ్వాయి : ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో, మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి, వెల్లుట్ల సొసైటీ చైర్మెన్లు నర్సింలు, తదితరులున్నారు. కామారెడ్డి మండలం గూడెం, తిమ్మక్‌పల్లి, కోటాల్‌పల్లి గ్రామాల్లో ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కామారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ధర్మగొని లక్ష్మీరాజాగౌడ్ ప్రారంభించారు. ఎల్లారెడ్డి మండలం శివాపూర్‌లో మహిళా సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం ప్రసన్నరాణి ప్రారంభించారు. రాజంపేట సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్ ప్రారంభించారు. భిక్కనూరు మండలం తిప్పాపూర్, మోటాట్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను విండో చైర్మన్ ఎన్గు వెంకట్ రెడ్డి ప్రారంభించారు. పిట్లం మండలం చిల్లర్గి, తిమ్మనగర్ సొసైటీ పరిధిలోని తిమ్మనగర్, పిట్లం, చిల్లర్గి, బొల్లక్‌పల్లి గ్రామాలలో ధాన్యం కొనుగొలు కేంద్రాలను సహకార సంఘం చైర్మన్‌లు శపథం రెడ్డి, సాయిరెడ్డిలు ప్రారంభించారు. లింగంపేట మండలం మెంగారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం శ్రీనివాస్ ప్రారంభించారు. రామారెడ్డి మండలం పోసానిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ సదాశివరెడ్డి ప్రారంభించారు. గాంధారిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్, తహసీల్దార్ రేణుక చౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. తాడ్వాయి మండలం చిట్యాల, సోమారం, బ్రహ్మజీవాడి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి ప్రారంభించారు.

పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మద్నూర్(జుక్కల్): రైతులు పొద్దుతిరుగుడు పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్ పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని మొగాలో పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటాల్‌కు రూ.7280తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో శివ, ఏఈవో విశాల్, సింగిల్ విండో చైర్మన్ రాంపటేల్, మాజీ ఎంపీటీసీ హన్మంత్‌పటేల్, నాయకులు రైతులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న చక్రపాణి

బాన్సువాడ : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రపాణి అన్నారు. గురువారం బాన్సువాడలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని, గత ఏడాది జులై నుంచి వేతనాలు, అక్టోబర్ నుంచి కోడిగుడ్ల బిల్లులు కలిపి రూ.10 కోట్ల బకాయిలు ఉన్నాయని, ఒక్క బాన్సువాడ డివిజన్‌కే రూ. 75 లక్షల బిల్లులు బకాయి ఉన్నాయన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహకులు చాంద్‌పాషా, విజయలక్ష్మి, శేషమ్మ, అమీర్‌బేగం తదితరులున్నారు.

నేడు రథోత్సవం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి సీతారాముల రథోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు గురువారం తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవంలో భాగంగా సీతారాముల రథోత్సవం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఆధ్యాత్మికం

ఘనంగా మహావీర్ జయంతి వేడుకలు



కామారెడ్డి అర్బన్ : మహావీర్ జయంతి సందర్భంగా గురువారం కామారెడ్డి శ్రీమహావీర్ జైన్ సంఘ్ ఆధ్వర్యంలో పట్టణంలో మహావీరుడి చిత్రపటంతో కీర్తనలు, భజన పాటలు పాడుతు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక సిరిసిల్లరోడ్డులోని మర్వాడీ ధర్మశాలలో మహిళలు, పురుషులు పాల్గొన్న ఆధ్యాత్మిక భజనలు నిర్వహించి మిఠాయిలు పంచారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం



భిక్కనూరు: మండల కేంద్రంలోని వనదుర్గ పెద్దమ్మ ఆలయ 26వ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.గురువారం ఆలయం వద్ద వనదుర్గ పెద్దమ్మ మూలవిరాట్‌కు ప్రత్యేకపూజలు నిర్వహించారు.తదుపరి ఉత్సవ విగ్రహనికి పూజలు చేసి భాజభజంత్రీలతో మండల కేంద్రంలో ఊరేగించారు. శుక్రవారం పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణంను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ముదిరాజు సంఘం అధ్యక్షుడు బండి రాములు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



రామారెడ్డి: శ్రీ సీతా రామచంద్రస్వామి శ్రీ రాజరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రంగు రవీందర్ గౌడ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాండ్ల సాయిలు, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. ఈసందదర్భంగా వివేకానంద ట్రస్ట్ సభ్యులు భక్తులకు మజ్జిగ, నిమ్మకాయ రసం పంపిణీ చేశారు.

కొండగట్టుకు హనుమాన్ స్వాముల పాదయాత్ర

కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రానికి సమీపన ఉన్న బూకాన్‌పల్లి హనుమాన్ ఆలయం వద్ద నుంచి నలుగురు మాలధారణ భక్తులు బోజన్నగారి రాజు పాటిల్, సంతోష్, విశాల్, మహేష్ స్వాములు గురువారం ఉదయం కొండగట్టుకు పాదయాత్రగా బయలు దేరారు. వీరికి ప్రత్యేక పూజలతో కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు.

భూదానం..గొప్ప మహాభాగ్యం



కామారెడ్డి అర్బన్: శారదమాత అమ్మవారి ఆలయ శక్తిపీఠం కోసం భూమిని దానం చేయడం గొప్ప మహాభాగ్యంగా భావించాలని రంగంపేట పీఠాధిపతి మాధవనంద సరస్వతీ స్వామి అన్నారు. గురువారం స్థానిక తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలో శ్రీశారదామాత శక్తిపీఠం భూదాన సంకల్ప విశేషపూజ యజ్ఞమహోత్సవం 150 దాతలతో నిర్వహించగా మాధవనంద సరస్వతి పాల్గొని ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో వేదపండితులు జి.ఆంజనేయశర్మ, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ అభివృద్ధికి విరాళం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొయ్యగుండు తండాలో చేపడుతున్న సంత్ సేవలాల్ మహరాజ్ ఆలయం అభివృద్ధి కోసం జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ సంపత్‌గౌడ్ ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. తనవంతుగా రూ. 20,000 వేలు తండావాసులకు ఆలయం వద్ద అందజేశారు. మాజీ ఎంపీపీ అమ్రియానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ పూల్యానాయక్, నంద్య. రవి. ప్రకాష్, ప్రతాప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సంగంలో శ్రీఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

నస్రుల్లాబాద్ : మండలంలోని సంగం గ్రామంలో గురువారం శ్రీ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లారం పీఠాధిపతి పిట్ల కృష్ణ మహారాజ్ హనుమాన్ స్వాములకు,భక్తులకు ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో హనుమాన్ గురు స్వామి నాగభూషణం, ప్రచార కర్త కూని సాయాగౌడ్,గ్రామస్తులు పాల్గొన్నారు.

17న బేతాళ స్వామి జాతర

బాన్సువాడ : పట్టణంలో ఈ నెల 17న బేతాళ స్వామి జాతర నిర్వహించనున్నట్లు జాతర కమిటీ సభ్యులు అర్షపల్లి గడిరెడ్డి తెలిపారు. గురువారం బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో పట్టణానికి చెందిన వివిధ కులసంఘాల నేతలు సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో అతిపెద్ద జాతరగా బేతాళస్వామి జాతర నిర్వహిస్తామని, ప్రతి ఏడాది ఏప్రిల్ మాసంలో జాతర వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన అన్నారు. 17న ఎడ్ల బండ్ల ప్రదర్శన, 18న కుస్తీ పోటీలు, 19న జాతర వేడుకలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, పట్టణ వాసులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణరెడ్డి, నార్ల రవీందర్, కొర్ల పోత్‌రెడ్డి, ఉప్పరి లింగం, మాసాని రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆర్షగురుకులంలో యువ నిర్మాణ శిబిరం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని పాతరాజంపేట శివారులోని ఆర్షగురుకులంలో ఈనెల 26 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ఆర్యవీర్ దళ్ యువ నిర్మాణ శిబిరం నిర్వహించనున్నట్లు ప్రతినిధి వేదార్థి ఆర్య తెలిపారు. శిబిరంలో 12 నుంచి 21 సంవత్సరాల లోపు వయస్సు గల అబ్బాయిలకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 9398526811, 9848853383 నంబర్లకు సంప్రదించాలన్నారు.

వైభవంగా హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవం

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని దోతిలో గురువారం నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయాన్ని ఖత్‌గావ్‌కర్ మహరాజ్ మల్లికార్జున్ స్వామి ప్రారంభోత్సవం చేశారు. ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. అర్చకులు వేదమంత్రల మధ్య హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు చేశారు.

పార్ట్ టైం అధ్యాపకుల నిరసన


సౌత్‌క్యాంపస్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న పార్ట్ టైం అధ్యాపకులు

భిక్కనూరు: విశ్వవిద్యాలయాల్లో సహయ ఆచార్యుల నియమకం కోసం విడుదల చేసిన జీవో 21ని రద్దు చేయాలని, పార్ట్ టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో పార్ట్ టైం అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పార్ట్ టైం అధ్యాపకులకు 12నెలలపాటు నెలకు రూ. 50 వేలతో కూడిన వేతనం అందిస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం విస్మరించిందన్నారు.

సౌత్‌క్యాంపస్ బంద్ విజయవంతం

కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం సౌత్‌క్యాంపస్ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ కాంట్రాక్టు అధ్యాపకులు, పార్ట్ టైం అధ్యాపకులు విద్యార్థులు సౌత్‌క్యాంపస్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు సంఘం రాష్ట్ర అసోసియేట్ ఉపాధ్యాక్షుడు నారాయణగుప్త నేతలు యాలాద్రి, ఇంద్రకరణ్‌రెడ్డి, పోతన్న, శ్రీకాంత్, కనకయ్య కిషన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర


మాగిలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


దోమకొండ మండలం ముత్యంపేటలో..

నిజాంసాగర్/తాడ్వాయి/దోమకొండ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు పలుచోట్ల రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. నిజాంసాగర్ మండలం మాగి గ్రామంలో, తాడ్వాయి మండలంలోని సోమారం గ్రామంలో, దోమకొండ మండలం ముత్యంపేట్,చింతామణి పల్లి గ్రామాలలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ నినాదాలలో నాయకులు ర్యాలీ తీశారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్ధనగ్నంగా తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తనకు న్యాయం చేయాలని మండలంలోని పోచారం గ్రామానికి చెందిన చౌదరి శ్రీనివాస్‌రావు గురువారం నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శనతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశాడు. కార్యాలయంలోకి వెళ్లే దారి మధ్యలో కూర్చొని అధికారులు వెంటనే తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయాన్ని కార్యాలయ సిబ్బంది స్థానిక పోలీసులకు తెలియజేశారు. నాగిరెడ్డిపేట పోలీసులు తహశీల్ కార్యాలయానికి చేరుకొని శ్రీనివాస్‌రావుకు నచ్చజెప్పి అతనిచేత నిరసన విరమింపజేశారు. తనకు రావాల్సిన భూమిని తన అన్న అక్రమంగా కబ్జా చేసుకున్నాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ గత మూడునెలల క్రితం ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తుపై అధికారులు తనకు ఇప్పటివరకు ఎలాంటి న్యాయం చేయలేదని ఆయన పేర్కొన్నాడు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ చౌదరి శ్రీనివాస్‌రావు గతంలో ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తుపై విచారణ జరపమన్నారు. శ్రీనివాస్‌రావుకు, అతని అన్న బాపురావుకు మధ్య ఆస్తిపంపకాల తగాదాలున్నాయని తెలిపారు.

సంక్షిప్తం

రాజంపేట పీహెచ్‌సీలో 'అమ్మ ఒడి'

రాజంపేట : స్థానిక పీహెచ్‌సీ పరిధిలో అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు. ఇందులో భాగంగా రెండో కాన్పు చెకప్ నిర్వహించినట్లు చెప్పారు.

'రాజీవ్ యువ వికాసం' సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పథకం వివరాలను మహిళలకు వివరించారు.

రేషన్ డీలర్‌పై కలెక్టరుకు ఫిర్యాదు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లి గ్రామ రేషన్ డీలర్ కాటిపల్లి రాజులుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు అదే గ్రామానికి చెందిన గంప నవీన్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం తన సొంత వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఫిర్యాదుదారుడు ఆరోపించారు.

రక్తదానానికి దాతలు తరలిరావాలి

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి ఈనెల 14న తాడ్వాయిలో నిర్వహించే మెగా రక్తదానం శిబిరానికి దాతలు తరలిరావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి అన్నారు. గురువారం మెగా రక్తదాన శిబిరం కరపత్రాలను నాగరాణి ఆవిష్కరించారు.

గ్రామ కమిటీల ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సజ్జన్‌పల్లి, శెట్పల్లి, పర్మళ్ల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, బీసీ కమిటీల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు గ్రామాల్లో నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. ఎన్నికైన సభ్యులకు నియామాక పత్రాలు అందజేశారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం నడిమి తాండకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి గురువారం రూ. 2 లక్షల ప్రమాదబీమా చెక్కును అందజేసినట్లు బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త గుగులోత్ హనుమ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. పార్టీ పరంగా రూ. 2 లక్షల చెక్కురావడంతో బాధిత కుటుంబానికి అందించి భరోసా కల్పించామన్నారు.

ఆదివాసీ శిక్షణ శిబిరానికి ఎంపిక

కామారెడ్డి టౌన్: ఆదివాసి శిక్షణ శిబిరానికి ఆదివాసి కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్, ఉపాధ్యక్షుడు నరేష్ రాథోడ్‌లు ఎంపికయ్యారు. చత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్ లో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే ఆదివాసి కాంగ్రెస్ లీడర్ షిప్ డెవలప్మెంట్ శిక్షణ శిబిరానికి గురువారం తరలివెళ్లినట్లు వారు తెలిపారు.

రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీ 50 ఫీట్ల రోడ్డును ఆక్రమించి భవన నిర్మాణం చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్‌పై చర్యలు తీసుకోవాలని శక్తి రెసిడెన్సి కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. శక్తి రెసిడెన్సి సెట్ బ్యాక్‌కు వదిలిన స్థలంలో రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని వివరించారు.